క్లుప్తంగా

తప్పులు దొర్లకుండా చూడండి


అధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్

కొణిజర్ల: దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఎంపీడీఓ కె.మహాలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డేటా ఎంట్రీలో ఎటువంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా.. జాగ్రత్తగా ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగించాలన్నారు. మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి టి.సుమ, ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, తహసీల్దార్ తఫజల్ హుస్సేన్ పాల్గొన్నారు.

అయోధ్య తలంబ్రాలు పంపిణీ


అయోధ్య తలంబ్రాలతో భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని విరాట్‌నగర్‌లో గల శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి శనివారం అయోధ్య రామ మందిరం తలంబ్రాలు చేరాయి. వీటిని కాలనీలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొగధంపురం రామకృష్ణ, అప్పాలాచారి, ఏడుకొండలు, రవికుమార్, కె.మోహనాచారి, అప్పారావు పాల్గొన్నారు.

'ఒలింపియాడ్'లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: ఇండియన్ ట్యాలెట్ సర్ఛ్ ఒలింపియాడ్ లెవల్-1 పరీక్షలో సత్తుపల్లిలోని శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన 81 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ప్రతి చూపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కే ఫరీద్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. క్లబ్ ఉపాధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా వితరణగా అందించారు. గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్‌రావు, గంగవరపు కిషన్‌రాయ్, యనమద్ది శ్రీను, కె.గోపి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన నాయకుడు పెద్ద సత్యం


మాట్లాడుతున్న బాగం హేమంతరావు

కొణిజర్ల: కొణిజర్ల మండల తొలి ఎంపీపీ, సీపీఐ సీనియర్ నాయకుడు తుళ్లూరి పెద సత్యం వర్ధంతిని శనివారం మండలంలోని తనికెళ్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకుడు బాగం హేమంతరావు సత్యం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నిబద్ధత కలిగి నిజాయతీతో పనిచేసిన కొద్ది మంది నాయకులలో సత్యం ఒకరన్నారు. ఆయన కొణిజర్ల మండల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు యర్రా బాబు, దొండపాటి రమేష్, మండల నాయకులు పీవీరావు, జమ్ముల జితేందర్‌రెడ్డి, గడల భాస్కర్, లేడిబోయిన గోపాలరావు, పసుమర్తి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాపాలన

కొణిజర్ల మండలంలో 18,534 దరఖాస్తులు..

కొణిజర్ల: మండలంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు శనివారం సాయంత్రంతో ముగిసాయి. మండలంలో మొత్తం 27 పంచాయతీలలో గత నెల 28 నుంచి ఈ నెల 6వరకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో లబ్ధిదారులను నుంచి మొత్తం 18,534 దరఖాస్తులను.. ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, తహసీల్దార్ ఎండీ తఫజల్ హుస్సేన్, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డిల సారథ్యంలో మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ, ఐకేపీ, ఆశా కార్యకర్తలు దరఖాస్తులు స్వీకరించారు. చివరి రోజు మండలంలోని తనికెళ్లలో, వైరా మున్సిపాలిటీ పరిధిలోని దిద్దుపూడి 15వ వార్డులో గ్రామసభ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.

వేంసూరులో.. 15,640

వేంసూరు: మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ప్రజాపాలన సభల్లో 15,640 మంది లబ్ధిదారులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. శనివారం మండలంలోని పల్లెవాడ, భరణిపాడులో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించగా.. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న డేటా ఎంట్రీని ఆర్‌డీఓ అశోక్ చక్రవర్తి పరిశీలించారు.

చింతకానిలో.. 19,194 దరఖాస్తులు..

చింతకాని: మండలంలో ఉన్నటువంటి 26 గ్రామ పంచాయతీల్లో మొత్తం 19,194 దరఖాస్తులను స్వీకరించారు. వీటిని చింతకాని మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేష్, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్ పర్యవేక్షించారు.


కొణిజర్ల: దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్


వేంసూరు: ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్ చక్రవర్తి


కొణిజర్ల: విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ..

తల్లాడలో.. 19,758

తల్లాడ: మండలంలో 27 పంచాయతీల్లోని నిర్వహించిన సభల్లో శనివారం నాటికి 19,758 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం చివరిరోజు ప్రజాపాలన సభలు గొల్లగూడెం, తెలగవరం, గోపాలపేట గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారపోగు వెంకటేశ్వరరావు, సర్పంచులు కృష్ణయ్య, ఎస్.మోహన్‌రావు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

20వేల దరఖాస్తులు స్వీకరణ..

కారేపల్లి: మండలంలోని 41 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో మొత్తం 20 వేల మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అధికారులు స్వీకరించారు. కాగా.. శనివారం సింగరేణి (కారేపల్లి), భాగ్యనగర్‌తండా, మొట్లగూడెం, రేలకాయలపల్లి గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సభల్లో దరఖాస్తులను స్వీకరించారు.

ప్రజాపాలనలో 21,980 దరఖాస్తులు..

ముదిగొండ: మండలంలోని 25గ్రామపంచాయతీల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో మొత్తం శనివారం వరకు అభయహస్తం దరఖాస్తులు 21,980 వచ్చినట్లు ఎంపీడీఓ అశోక్‌కుమార్ తెలిపారు. ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులతో పాటు వివిధ అంశాలకు సంబంధించి 1,192 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ, ఎంపీఓ తెలిపారు.

కల్లూరులో.. 24వేలు

కల్లూరురూరల్: మండలంలోని 31 పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో మొత్తం 24 వేల దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. తహసీల్దర్, ఎంపీడీఓ, డీటీ బాబ్జి ప్రసాద్ ఆధ్వర్యంలో మూడు టీంలుగా ఏర్పడి ఈ సభలు నిర్వహించారు. వీటిని ఉన్నతాధికారులు పరిశీలించారు. కాగా.. శనివారం మండలంలోని కల్లూరు, చెన్నూరు గ్రామాల్లో సభలు నిర్వహించగా.. పలువురు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు.


తల్లాడ: గొల్లగూడెంలో.. దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం


కల్లూరురూరల్: చెన్నూరులో..


కారేపల్లి: భాగ్యనగర్‌తండా గ్రామంలో..

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఆయేషాషరీన్

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఆయేషాషరీన్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన న్యాయ చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. క్రమశిక్షణ అలవర్చుకొని చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. పేదరిక నిర్మూలనకు చదువే.. ఆయుధమని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.విజయ్‌కుమార్, టి.అరుణకుమారి,కోర్టు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు

బోనకల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్వశిక్ష, కేజీబీవీ, గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు టైమ్‌స్కేల్ అమలుచేసి.. ఉద్యోగాలు రెగ్యులర్ చేయడంతో పాటు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. మహాసభ ప్రారంభానికి ముందుగా సంఘ పతాకాన్ని ఆవిష్కరించి, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన రాంబాబు, అనితలను సన్మానించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా భూపతి ప్రీతమ్, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటుగా మరో 21 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభలో సంఘ నాయకులు వల్లంకొండ రాంబాబు, నాగూర్‌వలీ, లక్ష్మణ్‌రావు, ఆంజనేయులు, సౌభాగ్యలక్ష్మి, పుల్లయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

కారేపల్లి: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ గిరిజన గురుకుల రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేంద్ర అన్నారు. మండలంలోని గాంధీనగర్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో పీజీటీ ఇంగ్లీష్ అధ్యాపకుడిగా పని చేస్తున్న బి.సురేంద్రను ఇటీవల టీఎస్ యూటీఎఫ్ గురుకుల రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. అదే విధంగా బి.ఈశ్వర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో వీరిరువురును గురుకుల ప్రిన్సిపాల్ దేవమార్థేండేయులు, వైస్ ప్రిన్సిపా ల్ చింతా రామనాథం, ఉపాధ్యాయులు ప్రభా వతి, శ్రీలత, చంద్రరేఖ, దశరథ్, రాంబాబు, భీముడు, వీరు ఘనంగా సన్మానించారు.

ముదిగొండలో వైద్యశిబిరం

ముదిగొండ: వికసిత భారత్ సంకల్ప యాత్ర ఆధ్వర్యంలో ముదిగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ముదిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారిణి అరుణాదేవి రోగులను పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దుర్గామల్లేశ్వరి, పీహెచ్‌ఎన్ నాగమణి, సూపర్‌వైజర్లు సరోజిని, లత, ఏఎన్‌ఎంలు రాణి, వసంత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారుల పాదయాత్ర


పల్లెలాబావి గుట్టపైకి పాదయాత్రగా వెళ్తున్న మాలధారులు

పెనుబల్లి: అయ్యప్ప మాలధారులు శనివారం పాదయాత్రగా పెనుబల్లి రామాలయం నుంచి చంద్రుగొండ మండలం పల్లెలా బావి గుట్టపైకి వెళ్లారు. పామర్తి శ్రీను స్వామి ఆధ్వర్యంలో మాలదారులు అయ్యప్పస్వామి నామస్మరణ చేస్తూ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు పామర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడి..

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల శివాలయంలో శనివారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం జరిగింది. గురుస్వామి, బోయినపల్లి రాము దీక్షా స్వాములకు ఇరుముడి కట్టారు. అనంతరం దీక్షాస్వాముల గ్రామంలో ఊరేగింపు నిర్వహించి శబరిమలై బయలుదేరి వెళ్లారు.

మోడల్ స్కూల్‌లో ఎంఈఓ విచారణ

కారేపల్లి: కారేపల్లి మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఎర్రబోడు గ్రామానికి చెందిన జస్వంత్ గతనెల 5న బయాలజీ ఉపాధ్యాయురాలు దండించింది. ఈ క్రమంలో విద్యార్థి అర్ధరాత్రి వరకు అటు ఇంటికి.. ఇటు కారేపల్లి బీసీ హాస్టల్‌కు వెళ్లకపోవటంతో తల్లిదండ్రులు.. మోడల్ ప్రిన్సిపాల్ ఎండీ అక్తర్, డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం మండల విద్యాశాఖ అధికారి జయరాజు, కారేపల్లి ఎస్సై రామారావులు పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. సదరు విద్యార్థి అల్లరి చేయటంతో పాటు, బూతులు మాట్లాడటంతో ఉపాధ్యాయురాలు ఆగ్రహంతో దండించినట్లు తెలిసింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: సత్తుపల్లిలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు టౌన్-2 ఫీడర్‌లో ట్రీ కటింగ్ చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్, అంబేద్కర్‌నగర్, విరాట్‌నగర్, లలితకుమారి ఆస్పత్రిరోడ్, అవని వెంచర్, కల్పతరురోడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

కల్లూరు: కల్లూరు పట్టణ పరిధిలో ఆదివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ వి.గణేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా (సత్తుపల్లి నుంచి ఖమ్మం వెళ్లేటప్పుడు కుడిచేతి వైపు)కు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం


శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చింతకాని: మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెళ్లిన పోటు శ్రీనివాసరావును పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పూలమాలలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


వైరా: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. వైరాలోని 20వ వార్డులో శనివారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్, వార్డు కౌన్సిలర్ గుగులోత్ లక్ష్మీబాయి, ఇన్‌చార్జ్ కమిషనర్ కరుణాకరరెడ్డి, వార్డు పెద్దలు పాల్గొన్నారు

చిన్నారులకు దుస్తులు పంపిణీ..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్‌లో.. జీటీఎస్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు బిషప్ ఎంఎం జాకబ్ అందించిన దుస్తులు, బ్యాగులు, దుప్పట్లను ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిస్వార్థ భావనతో అనాథలైన చిన్నారులను ఆదుకుని సేవలందిస్తున్న జాకబ్ అతని సంస్థ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మపాలెం ఎంపీటీసీ సభ్యురాలు బానోత్ అనూష, ఉపసర్పంచ్ బానోత్ నాగేశ్వరరావు, గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవేణు, జీఎస్ఎస్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, ఏఓ శైలజ, ఇన్‌చార్జ్ పుల్లారావు, నరసయ్య, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, హెచ్‌ఎం వాణి, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లప్పుడు రుణపడి ఉంటా..


పెనుబల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్/పెనుబల్లి: మహిళా ఎమ్మెల్యేగా సత్తుపల్లి నియోజకవర్గ చరిత్రలోనే తొలిసారి అవకాశం కల్పించిన ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో, పెనుబల్లి మండలంలోని లంకపల్లి, తాళ్లపెంట గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన సభలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్ని నెరవేర్చి తీరుతుందన్నారు. సత్తుపల్లిలో నిత్యం ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని ఏ సమస్య ఉన్నా తనకు తెలపాలన్నారు. పోడు భూముల సమస్య కాంగ్రెస్ ప్రభుత్వంలో సంపూర్ణంగా పరిష్కరించి, నిజమైన పోడు దారులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలల్లో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, వైస్ చైర్మన్ తోట సుజలారాణి, కౌన్సిలర్లు కొత్తూరు ఉమామహేశ్వరరావు, దూదిపాల రాంబాబు, సొసైటీ ఉపాధ్యక్షుడు చెన్నారావు, ఎండి కమల్‌పాషా, చల్లగుళ్ల నర్సింహారావు జెడ్పీటీసీ మోహన్‌రావు, లంకపల్లి సర్పంచ్ సరోజిని, ఆత్మా కమిటీ మాజీ చైర్మన్ సున్నా రామకృష్ణ, ఉప సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీఈఓ వాల్మీకి కిషోర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం


వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ పుల్లయ్య

సత్తుపల్లిరూరల్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తైన సందర్భంగా దేశ వ్యాప్తంగా 'ఖేల్ ఇండియా'పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో పలు రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సత్తుపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల క్రీడాకారులకు నిర్వహించిన వాలీబాల్ పోటీలను సత్తుపల్లి ఎంపీపీ సంగం పుల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక వికాసం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెరుగుతాయన్నారు. ఈ పోటీలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, సుదర్శన్ మిశ్రా, జొన్నలగడ్డ నరేష్ పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపించండి


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రసాద్

సత్తుపల్లి: బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపించాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిత్తలూరి ప్రసాద్ అన్నారు. శనివారం రాజీవ్‌నగర్‌కు చెందిన పలువురు విద్యార్థులు గత కొంతకాలంగా పాఠశాలకు రాకపోవడంతో.. వారి తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి అవగాహన కల్పించారు. హాజరు ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలను తల్లిదండ్రులు చేసే వృత్తి పనుల్లో గానీ.. వేరే దగ్గర గానీ పనులు చేయించకూడదన్నారు. అలా చేసినట్లయితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

టీఎస్ యూటీఎఫ్ ..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎం.నరసింహారావు చేతుల మీదుగా క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ కార్యదర్శి బొల్లె పోగు ప్రసాద్ మాట్లాడుతూ.. టీఎస్ యూటీఎఫ్ నిరంతరం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి వారి సమస్యల సాధన కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాక్షులు జి.పాపయ్య, ఎంఎం.రాజకుమారి, జీఎస్.మురళీకృష్ణ, టీ.సునీత, వీరన్న, రత్నకుమారి, కేవీ మోహన్‌రావు, గిరిజ, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

జీఎంపీఎస్..


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కాసాని ఐలయ్య, తదితరులు

పెనుబల్లి: జీఎంపీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం వీయంబంజర్ సప్తపది ఫంక్షన్‌హాల్‌లో గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కాసాని ఐలయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీ పథకంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం రూ.2 లక్షలు వెంటనే నగదు బదిలీ చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది యాదవ్, కురమలు డీడీ డబ్బులు చెల్లించారని, ఖమ్మం జిల్లాలో 11 వేల మంది రూ.50 కోట్లు డీడీలు కట్టి 18 నెలలుగా ఎదురుచూస్తున్నారని, గత ప్రభుత్వం నగదు బదిలీ చేస్తానని మోసం చేసిందన్నారు. త్వరలో సంఘం ముఖ్యమంత్రిని కలిసి ఈ సమస్యపై వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు చింతలచెర్వు కోటేశ్వరరావు, కార్యదర్శి తుశాకుల లింగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, నరసింహారావు, తిరుపతిరావు, సోమయ్య, కృష్ణపాశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ..

సత్తుపల్లిరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతనంగా ముద్రించిన 2024 డైరీని సత్తుపల్లి ఉప కోశాధికారి సునీల్ ఆవిష్కరించారు. శనివారం జవహర్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్టీ డైరీ, సంఘం నాయకుల క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీఓ సునీల్ మాట్లాడుతూ.. సమస్యలను తన పరిధిలో ఉన్నంత వరకు తప్పకుండా పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వి.చెంచిరెడ్డి, యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్, నాయకులు బూరుగు దాసు, జి.కృష్ణయ్య, ప్రకాశరావు, అద్దంకి వెంకటరత్నం, మధుసూదన్‌రాజు, ఎస్టీ కార్యాలయం ఉద్యోగి సంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


కోటేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న పరిశ పుల్లయ్య

ముదిగొండ: ముదిగొండకు చెందిన ఆంధ్రప్రభ రిపోర్టర్ ఉప్పు కోటేశ్వరరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో విషయం తెలుసుకున్న పరిశ సీతారత్నం చారిటబల్ ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య పరామర్శించారు. శనివారం కోటేశ్వరరావు నివాసంలో రూ.15 వేల చెక్కును ఆయనకు అందజేశారు. గతంలో సీనియర్ జనర్నలిస్టుగా పనిచేసిన పరిశ పుల్లయ్య తోటి రిపోర్టర్‌కు ఆర్థికంగా సహాయపడడంతో ముదిగొండలో పలువురు రిపోర్టర్లు అభినందించారు.